సాగు సందిగ్ధం

ఇక క్రాప్ హాలిడే నా..?

- జూరాల, కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పరిధిలో సాగు ప్రశ్నార్థకమేనా..?
- ప్రాజెక్టుల్లో నీళ్లు లేవని క్రాప్ హాలిడే..
- అయోమయంలో ఆయకట్టు రైతులు
- నీళ్లు వదులుతారన్న ఆశతో యాసంగికి..
- ఎమ్మెల్యేలు మాట్లాడినా పట్టించుకోని వైనం
- నారాయణపూర్ కాల్వల మరమ్మతుతో పీజేపీకి స్వల్పంగా నీటిరాక

మహబూబ్‌నగర్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో యాసంగి పంటలపై అనిశ్చితి నెలకొన్నది. ఈసారి వానకాలం సీజన్‌లో వర్షాభావం వెంటాడిన ప్పటికీ సరైన సమయానికి అప్పుడప్పుడు కురిసిన వానలు రైతన్నను గట్టెక్కించాయి. ఎగువన కురిసిన భారీ వర్షాలకు జూరాల ప్రాజెక్టు జలకళ సంచరించుకున్నది. కుడి, ఎడమ కాల్వలతోపాటు భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు సరైన సమయంలో నీటిని విడుదల చేసి కేసీఆర్ ప్రభుత్వం కర్షకులను ఆదుకున్నది. మరోవైపు వర్షాలకు వాగులు పొంగి పొర్లడంతో ఉమ్మడి జిల్లాలో చెక్ డ్యామ్‌లు జలకళ సంతరించుకున్నాయి.

వరుణుడి జాడేది..?

వర్షాకాలం దాటిపోయినప్పటికీ ఇప్పటి వరకు మళ్లీ వరుణుడి జాడ కనిపించలేదు. తుపాన్లు వచ్చినా వాటి ప్రభావం పెద్దగా లేదు. దీంతో యాసంగి పంటలకు సాగునీరు లభించని పరిస్థితి దాపురించింది. తీవ్ర వర్షాభావాలతో ఇటు జూరాల ప్రాజెక్టులో.. అటు మిగతా ప్రాజెక్టుల్లో నీళ్లు అడుగంటుతున్నాయి. దీంతో ఇరిగేషన్ అధికారులు ఈ ఏడాది యాసంగి సీజన్‌కు క్రాప్ హాలిడే ప్రకటించారు. ఇక్కడే అసలు కథ ప్రారంభమైంది. భీమా ప్రాజెక్టు కింద సంగంబండ రిజర్వాయర్లో నీరు సమృద్ధిగా ఉండటంతో అధికారులు రైతుల కోరిక మేరకు కాల్వల ద్వారా నీటిని విడుదల చేశారు. కోయిల్‌సాగర్‌లో కూడా పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ ఉన్నతాధికారుల సూచన మేరకు క్రాప్ హాలిడే ప్రకటించారు. జూరాల ప్రాజెక్టులో ఆశించినంత మేర నీటి నిల్వలు లేకపోవడంతో ఇక్కడ కూడా అదే జరిగింది. అయితే అధికారుల సూచనలను పట్టించుకోకుండా రైతన్నలు యాసంగి పంటలకు సిద్ధమవుతున్నారు. జూరాల, కోయిల్‌సాగర్, ఎంజీకేఎల్ఐ కింద అన్నదాతలు పెద్ద ఎత్తున వరి ఇతర పంటల సాగు చేపట్టారు. అధికారులు క్రాప్ హాలిడే ప్రకటించడంతో ఏం చేయాలో రైతులకు పాలుపోవడం లేదు.

కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీళ్లు

ఎమ్మెల్యేలు కోరినా విడుదలకాని నీరు

ఈ నెలలో ప్రభుత్వం మారిపోవడంతో కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కింద నీటి విడుదల జరుగుతుందా..? జరగదా..? అనేది సందిగ్ధంగా మారింది. మరోవైపు రైతుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణిక, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి రెండు రోజుల కిందట ఇరిగేషన్ అధికారులను హైదరాబాద్‌లో కలిశారు. యాసంగికి కోయిల్‌సాగర్ కింద ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం స్వీకరించిన అధికారులు ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కాగా కోయిల్‌సాగర్ కింద క్రాప్ హాలిడే ప్రకటించాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో తామేమి నిర్ణయం తీసుకోలేమని, అంతా ప్రభుత్వం చేతిలో ఉన్నదని ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ఎమ్మెల్యేల ప్రతిపాదనలకు ఫలితం శూన్యంగా మారింది. కేసీఆర్ ప్రభుత్వంలో ఎక్కువ ప్రాధాన్యమిస్తూ వారి ప్రయోజనాలు కాపాడేందుకు ముందుండే ప్రయత్నం జరిగింది. కానీ ఈసారి ప్రభుత్వం మారడంతో విభిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఇంతకు యాసంగి పంటలకు నీరు వదులుతారా? లేదా? అనేది ఇంకా తేల్చలేకపోతున్నారు. కానీ రైతులు మాత్రం పెద్ద ఎత్తున సాగు చేసుకుంటుండటంతో పంటలను కాపాడతారా? క్రాప్ హాలిడే ప్రకటించి చేతులు దులుపుకుంటారని తేల్చాల్సి ఉన్నది. కోయిల్‌సాగర్ ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయాలని మక్తల్, నారాయణపేట, దేవరకద్ర ఎమ్మెల్యేలు ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులను కలిసి విన్నవించారు. అధికారులు సానుకూలంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రాజెక్టుల కింద రైతులు అయోమయంలో పడ్డారు. క్రాప్

కోయిల్‌సాగర్ కింద 9 వేల ఎకరాలు

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలోని మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టు కోయిల్‌సాగర్‌లో వానకాలం సీజన్ ముగిసినా నిండుకుండలా కనిపిస్తుంది. వర్షాలకుతోడు.. జూరాల బ్యాక్ వాటర్ నుంచి ప్రాజెక్టుకు నీటిని తరలించారు. దీంతో రిజర్వాయర్‌లో నీటిమట్టం అంతకంతకు పెరిగింది. ప్రస్తుతం ప్రాజెక్టులో గరిష్ట నీటిమట్టం 32 అడుగులకుగానూ 31 అడుగుల నీరు నిల్వ ఉన్నది. అంతేకాకుండా ఈ ప్రాజెక్టు కింద ఉన్న పెద్దవాగుపై ఉన్న చెక్ డ్యామ్‌లున్నీ జలకళను సంతరించుకున్నాయి. దీంతో రైతాంగం ఇటు వాగు పరివాహక ప్రాంతాలు, కోయిల్‌సాగర్ కుడి, ఎడమ కాల్వల కింద సుమారు 9,000 ఎకరాల్లో సాగుకు ప్రస్తుతం సమృద్ధమయ్యారు. అధికారులు వద్దంటున్నప్పటికీ రైతులంతా నారుమడులు వేసుకోవడానికి పొలాలు దుక్కిదున్ని సిద్ధం చేసుకున్నారు. మడులు సిద్ధం చేసి వారంలో నారు పోసేందుకు రెడీ అవుతున్నారు. అయితే ప్రస్తుతం కుడి, ఎడమ కాల్వలకు సాగునీరు వదులుతారా? లేదా..? అనేది ఉత్కంఠంగా మారింది. రైతులంతా యాసంగి పంటకు సిద్ధమవుతుండడంతో అధికారులు క్రాప్ హాలిడే ప్రకటించి వారి ఆశలపై నీళ్లు చల్లారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కేవలం సాగునీటి ఉద్దేశించిందని రైతులకే నీరు వాడుకునే హక్కు ఉన్నదని చెబుతున్నారు. ఒకవైపు అధికారులు వద్దంటున్నా రైతులు సాగు చేస్తుండడంతో యాసంగి పంటల పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనన్న ఆందోళన నెలకొన్నది.

క్రాప్ హాలిడేకే కట్టుబడి ఉంటారా..?

యాసంగి పంటలకు నీళ్ల వదులు తారా..? అనే డైలామా కొనసాగుతున్నది. నారాయణపూర్ జలాశయం కింద కాల్వలకు మరమ్మతు పనులు జరుగుతుండడంతో కొంత నీటిని డ్యాం అధికారులు దిగువకు వదులుతున్నారు. దీంతో జూరాల ప్రాజెక్టుకు స్వల్పంగా ఇన్‌ఫ్లో నమోదవుతున్నది. వచ్చిన వరదను వచ్చినట్టే నెట్టెంపాడు, భీమా ప్రాజెక్టులకు 1500 క్యూసెక్కులను వదులుతున్నారు. ఈసారి వర్షాభావ పరిస్థితుల వల్ల జూరాల డెడ్ స్టోరేజ్‌కి చేరుకోవడం ఖాయమని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో సాగునీరు విడుదల చేయడం అసాధ్యమని, క్రాప్ హాలిడేకి రైతులు కట్టుబడి ఉండాలని సూచిస్తున్నారు.

సాగర్ నీరు విడుదల చేయకుంటే ఆందోళన

కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో అనుకున్న స్థాయిలో నీటిమట్టం ఉన్నదని, ఈ జలాలతో రైతులకు ప్రయోజనం చేకూర్చే నిర్ణయం తీసుకోవాలని, లేకుండే ఆందోళన చేపడుతామని రైతులు హెచ్చరిస్తున్నారు. గతంలో కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కింద ఎన్నడూ ఈ పరిస్థితి రాలేదని, రైతులు అడిగిన తక్షణమే ప్రభుత్వం స్పందించి నీటిని విడుదల చేసేదని గుర్తు చేశారు. నీటిమట్టం తగ్గినప్పటికీ ఎన్నడూ తొమ్మిదిన్నర ఏళ్లలో క్రాప్ హాలిడే ప్రకటించిన దాఖలాలు లేవని రైతులు పేర్కొంటున్నారు. పుష్కలంగా నీరు పెట్టుకొని కూడా క్రాప్ హాలిడే ప్రకటించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గతంలో ఈ ప్రాజెక్టు కింద ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు తాగునీటి అవసరాలకు నీరు వాడుకునేవి. మిషన్ భగీరథ పథకం వచ్చాక నేరుగా శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి కృష్ణా జలాలను తరలించడంతో కోయిల్‌సాగర్ నీటిని సాగునీటికే వినియోగించే వారన్నారు. అదే ఆశతో యాసంగి పంటలకు సిద్ధమవుతున్నామని, సాగునీరు విడుదల చేయాల్సిందేనని రైతులు పట్టుబడుతున్నారు.

నీటి విడుదలపై రెండు రోజుల్లో స్పష్టత..

జూరాల డ్యాంలో తగినంత నీటి సామర్థ్యం లేకపోవడంతోపాటు నారాయణపూర్ డ్యాం కింద క్రాఫ్ హాలిడే ప్రకటించడంతో అక్కడి నుంచి వచ్చే రీజనరేటర్ వాటర్ నిలిచిపోవడంతో మనకు ఇన్‌ఫ్లో వచ్చే అవకాశం లేదు. ఈ ఏడాది యాసంగిలో జూరాల కింద క్రాఫ్ హాలిడే ప్రకటించే అవకాశముంది. రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తాం.

- జుబేర్ అహ్మద్, జూరాల ప్రాజెక్టు ఈఈ

నీళ్లొచ్చేనా? తుంగభద్రనదిలో తగ్గిన నీటినిల్వలు

గద్వాల, డిసెంబర్ 16 : జిల్లాలో జూరాల, నెట్టెంపాడు, ఆర్డీఎస్ రైతులకు ఈ ఏడాది క్రాఫ్ హాలిడే తప్పేట్టు లేదు. ఈ వానాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురువకపోవడంతో ప్రాజెక్టుల్లో నీటి సామర్థ్యం తగ్గుముఖం పట్టడంతో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఓ వైపు రైతులు యాసంగి సాగుకు సిద్ధమవుతుండగా, అధికారులు మాత్రం రైతులు సాగు చేస్తున్న పంటలకు నీళ్లిస్తామని స్పష్టమైనా ఇబ్బందులు ఉండేవి కావు. అయితే ఈ ఏడాది యాసంగిలో నారాయణపూర్ డ్యాం కింద క్రాఫ్ హాలిడే ప్రకటించడంతో నీళ్లు వచ్చే పరిస్థితి లేకపోవడంతో యాసంగి పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. గతేడాది యాసంగిలో జూరాల కింద 14,534 ఎకరాలు, నెట్టెంపాడ్ కింద 40,044, ఆర్డీఎస్ కింద 33,683 ఎకరాలకు సాగునీరిచ్చారు. ప్రస్తుతం మూడు ప్రాజెక్టుల కింద నీరు ఇచ్చే పరిస్థితి లేదు. ఆర్డీఎస్‌కు సంబంధించి తుంగభద్ర డ్యాంలో ఉన్న నీటిని నిల్వను బట్టి ఈ వానాకాలం పంటలకు 3టీఎంసీల ఇండెంట్‌ను ప్రస్తుతం మనం వాడుకున్నాం. ఇక డ్యాంలో నీరు అనుకున్న స్థాయిలో నిల్వ లేకపోవడంతో ఆర్డీఎస్ కింద యాసంగి పంటలకు నీరు వదలడం లేదు. దీంతో జిల్లాలో ఆర్డీఎస్, జూరాల, నెట్టెంపాడ్ ప్రాజెక్టుల కింద అధికారులు క్రాఫ్ హాలిడే ప్రకటించే అవకాశమున్నది. ఈ రెండు రోజుల్లో అధికారులు అధికారికంగా ప్రకటన చేయనున్నట్లు తెలుస్తున్నది. కేవలం బోరుబావుల కింద మాత్రమే రైతులు ఈ యాసంగిలో పంటలు సాగు చేసుకునే అవకాశముంది

వరిసాగు కోసం చేసిన కరిగెట

వానకాలం పంటలు పూర్తిగా ముగియడంతో ఎన్నో ఆశలతో అన్నదాతలు యాసంగి వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. యాసంగి సాగులో రైతులు ఎక్కువగా దొడ్డు రకాల సాగువైపు మొగ్గు చూపుతున్నారు. చలిప్రభావం నారుమళ్లపై పడకుండా ప్రత్యేక నారుమడి యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని స్వల్పకాలిక రకాలైన (120-130 రోజుల పంట కాలం) 1010, కేఎన్ఎం (118), ప్రైవేటు కంపెనీలోని స్వల్ప కాలం వంటి రకాలను సాగు చేసుకోవచ్చని చెబుతున్నారు. చలి ఉధృతిని బట్టి పంటకాలం 10 నుంచి 15 రోజుల వరకు పెరిగే అవకాశముంది. ముఖ్యంగా చలి ప్రభావం నారుమళ్లపై పడకుండా ప్రత్యేక నారుమడి యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచిస్తున్నారు.

– పెద్దమందడి, డిసెంబర్ 16

యాసంగికి సంసిద్ధం

- నారుమడులు సిద్ధం చేస్తున్న రైతులు
- యాజమాన్య పద్ధతులు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు

నారుమడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- రైతులు చలికి తట్టుకునే వరి వంగడాలను ఎంపిక చేసుకోవాలి.
- మండె కట్టిన విత్తనాలను వేయడం తప్పనిసరిగా అల వాటు చేసుకోవాలి.
- నారుపోసుకునే ముందు నారుమడికి సరిపడా సుమారు 2కిన్నింటాళ్ల బాగా మాగిన పశువుల ఎరువు లేదా కోళ్ల ఎరువు, కిలో జింక్ సల్ఫేట్ తప్పనిసరిగా వాడాలి.
- భాస్వరాన్ని రెట్టింపు మెతాదులో వేసుకోవాలి.
- రాత్రిపూట నారుమడిలో నీళ్ల లేకుండే చలి ప్రభావం మొక్కలపై తగ్గుతుంది. కాబట్టి ప్రతిరోజూ వేకువజామున, పగటిపూట నీటిని పెట్టే సాయంత్రం తీసివేయాలి.
- చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు నారు మడి చుట్టూ ఒక అడుగు ఎత్తులో పలు చని పాలిథిన్ షీట్ లేదా ఖాళీ ఎరువుల సంచులతో కట్టిన పట్టాలను సాయంత్రం వేలలో కప్పి ఉదయం పూట తీసివేయాలి.
- రాత్రి ఉష్ణోగ్రతలు 10డిగ్రీల కంటే తగ్గినప్పుడు చలి తీవ్రత పెరిగి నారు ఎర్రబడడం, సరిగ్గా ఎదగకపోవడం పంట కాలం పెరిగిపోవడం, పోషకాలోపాలు ముఖ్యంగా జింక్‌లోప లక్షణాలు కనిపించే అవకాశం ఉన్నది.
- ఈ జింక్ లోపం వల్ల ఆకులపై తుప్పుమచ్చలు ఏర్పడుతాయి. ఈ లోప నివారణకుగానూ లీటరు నీటికి 2గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేసుకోవాలి.
- చలి తీవ్రత ఎక్కువగా ఉంటే స్ఫర్ట్రపాల్ లేదా పార్ములా-4 వంటి సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని 5లీటర్ల నీటికి 1గ్రాము చొప్పున వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.
- కాండం తొలిచే పురుగు బారి నుంచి నారును కాపాడుకునేందుకు, నారు తీయడానికి వారం రోజుల ముందు, 5సెంట్ల నారుమడికి 800గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు వేయాలి.
- చలికి ఆగ్గితెగులు ఆశించే అవకాశం ఉంటుంది. ముందు జాగ్రత్తగా లీటరు నీటికి 0.6గ్రాముల ట్రైసైక్లోజోల్‌ను కలిపి పిచికారీ చేయాలి.
- రైతులు యాజమాన్య పద్ధతులను పాటిస్తే ఆరోగ్యవంతమైన నారు పెంచుకొని, తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు.

పెద్దమందడి శివారులో నారుపోసిన దృశ్యం

నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి..

రైతులు యాసంగిలో సాగు చేసే వారి విత్తనాలు ఎంపికలో నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. ఆదేవిధంగా మండే పెట్టేటప్పుడు చలి లేకుండా వరి విత్తనాలపై గడ్డి బాగా కప్పి పైన కవరు వేసుకుంటే మంచి మొలక వస్తుంది. నారుమడులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి వేసుకోవాలి.

- కురుమయ్య, వ్యవసాయ అధికారి

బకాయిల కుప్ప

- మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో పేరుకుపోయిన రూ.21కోట్ల అద్దె
- 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.94.80లక్షలు వసూలు
- టెండర్ పొంది కనిపించని దుకాణాదారులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు ■ వసూలైతేనే అభివృద్ధి పనులు

జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో మున్సిపల్ దుకాణాలు

నందలాల్ పవార్ ఒక దశలో అద్దె వసూళ్లపై అధికారులతో తరుచూ సమీక్ష నిర్వహించారు. సిబ్బంది ఉరుకులు పరుగులు పెట్టారు. రూ.94.80లక్షలు వసూలు చేశారు. అయినా ఇంకా మున్సిపాలిటీకి రూ.21కోట్లుపైగా బకాయిలు వసూలు కావాల్సి ఉన్నది.

వ్యాపారులపై కొరడా..

వేలంలో పాంచిన దుకాణాలకు తాళాలు వేసి అద్దెలు ఏండ్లుగా చెల్లించని వ్యాపారులపై గురువారం ఆర్సీపాలెట్ మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పురపాలిక సెక్షన్ డైవ్ నిర్వహించి కొరడా ఝుళిపించారు. ఇటీవలే స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి న్యూటౌన్‌లోని మున్సిపాలిటీకి సంబంధించిన దుకాణ సముదాయాన్ని తనిఖీ చేశారు. పలు దుకాణాలు తాళాలు వేసి ఉండడాన్ని గమనించిన ఎమ్మెల్యే వాటి పరిస్థితిపై ఆరా తీశారు. దీంతో మళ్లీ పురపాలిక శాఖ అధికారులు స్పెషల్ డైవ్ నిర్వహించారు.

పేరుకుపోయిన పెంచిన అద్దెలు..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో రెండు ప్రధాన వ్యాపార సముదాయాల్లో ఉన్న దుకాణాలను 1972-74 సంవత్సరంలలో కేటాయించారు. అద్దెలను 2017 వరకు అలాగే వసూలు చేశారు. 2017 జూన్ 9న మార్కెట్‌లో 39, క్లాక్ టవర్‌లోని 22 దుకాణాల అద్దె పెంచారు. దీంతో నెలకు రూ.27.44లక్షల చొప్పున అద్దాలయం పురపాలికకు రావాలి. ఐదున్నరేండ్ల కిందట ఆయా దుకాణాలకు టెండరు నిర్వహించి కేటాయించారు. నెలకు 27.44లక్షల ప్రకారం ఐదున్నరేండ్లకు రూ.కోట్లలో బకాయిలు ఉన్నాయి. ఈ బకాయిలు వసూలు చేయాల్సిన బాధ్యత పురపాలికకు ఉన్నది. ఇప్పటికైనా మున్సిపల్ దుకాణాలు ఎవరికి కేటాయించారు, టెండర్ పొందిన దుకాణాదారులు వివరాలు పొందు పర్చాలని అదాయం సమాకూరనున్నది. పురపాలికలో మొత్తం 258 దుకాణాలు ఉండగా, 237 దుకాణాలను అద్దెలకు కేటాయించగా, 21 ఖాళీగా ఉన్నాయి. ఇందులో మార్కెట్ ఏరియాలో ఐడీఎస్ఎంటీ దుకాణాలు 15, మున్సిపల్ దుకాణాలు 47, టీడీగుట్ట ఐడీఎస్ఎంటీ దుకాణాలు 8, క్లాక్ టవర్ ఐడీఎస్ఎంటీ దుకాణాలు 17, క్లాక్ టవర్ మున్సిపల్ దుకాణాలు 41, న్యూటౌన్ ఐడీఎస్ఎంటీ దుకాణాలు 98, నూబస్టాండ్ 18, పద్మావతి కాలనీ 11, ఎనుగొండ 3 షాపులు ఉన్నాయి.

2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.94.80లక్షలు వసూలు..

పురపాలిక దుకాణాల అద్దె వసూళ్లపై అధికారులు అంతగా దృష్టి సారించడం లేదు. గతంలో ఉన్న అధికారులు పట్టుబట్టి పేరుకుపోయిన బకాయిలను రూ.కోట్లలో వసూలు చేశారు. దుకాణాల తాళాలు వేసి మరీ ఆదాయాన్ని పురపాలికకు తీసుకొచ్చారు. ఆ ఆర్థిక సంవత్సరంలో ప్రత్యేకాధికారి తేజస్ కారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పురపాలిక పరిధిలోని వంద దుకాణాల అద్దెలు రూ.కోట్లలో పేరుకపోయాయి. ఇప్పటి వరకు రూ.21కోట్ల 7లక్షల 54వేలకు పెండింగ్ చేరింది. గత రెండేండ్ల కిందట మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా ఉన్న అప్పటి అడిషనల్ కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కొంత మేరకు సఫలమయ్యారు. అలాగే మరోపాలి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తే మున్సిపాలిటీకి భారీ మొత్తంలో అదాయం సమకూరనున్నది. పురపాలికలో మొత్తం 258 దుకాణాలు ఉండగా, 237 దుకాణాలను అద్దెలకు కేటాయించగా, 21 ఖాళీగా ఉన్నాయి. ఇందులో మార్కెట్ ఏరియాలో ఐడీఎస్ఎంటీ దుకాణాలు 15, మున్సిపల్ దుకాణాలు 47, టీడీగుట్ట ఐడీఎస్ఎంటీ దుకాణాలు 8, క్లాక్ టవర్ ఐడీఎస్ఎంటీ దుకాణాలు 17, క్లాక్ టవర్ మున్సిపల్ దుకాణాలు 41, న్యూటౌన్ ఐడీఎస్ఎంటీ దుకాణాలు 98, నూబస్టాండ్ 18, పద్మావతి కాలనీ 11, ఎనుగొండ 3 షాపులు ఉన్నాయి.

వసూలైతేనే అభివృద్ధి పనులు..

మహబూబ్‌నగర్ పట్టణం అభివృద్ధి చెందుతున్నది. మున్సిపాలిటీలో పలు గ్రామాలు విలీనమయ్యాయి. దీంతోపాటు కొత్తకాలనీలు వెలుస్తున్నాయి. అక్కడ మౌలిక వసతులు, రోడ్లు, డ్రైనేజీలు లేవు. రూ.కోట్ల అద్దె బకాయిలు వసూలైతే వీటితో ఈ పనులు చేపట్టేందుకు అవకాశమున్నది. కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీల సమస్యలు తీరి ప్రజల ఇబ్బందులు చాలా వరకు తీరనున్నాయి.

అద్దె వసూలుకు స్పెషల్ డ్రైవ్..

మున్సిపల్ అద్దె వసూలుకు ఆర్సీపాలెట్ మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. న్యూటౌన్ మున్సిపల్ కాంప్లెక్స్‌లో మొత్తం 98 దుకాణాలు ఉన్నాయి. అందులో 88 మంది దుకాణాలు లీజ్‌లో ఉండగా, 17మైగా దుకాణాలకు సంబంధించి గత పదేండ్లుగా అద్దె చెల్లించకుండా తాళం వేసి ఉన్నట్లు గుర్తించాం. ఆయా దుకాణాలకు మున్సిపల్ శాఖా నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి రీటెండర్ నిర్వహిస్తాం. మొండిబకాయి ఉన్న దుకాణాదారులకు నోటీలు జారీ చేశాం. అవసరమైతే దుకాణాలు సీజ్ చేస్తాం. పురపాలిక నింబంధనల మేరకు అద్దె చెల్లించాలి.

- డి.వ్రవీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ